

రేపటి నుంచి జిన్నింగ్ మిల్లుల బంద్



- ఆందోళనలో పత్తి రైతులు
- సీసీఐ, ప్రైవేట్ వ్యాపారులు కొన్నది 60వేల క్వింటాళ్లు
- ఇంకా కొనాల్సింది నాలుగు లక్షల క్వింటాళ్ల పైచిలుకు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఇప్పటికే సీసీఐ ద్వారా అంతంత మాత్రంగా జరుగుతున్న పత్తి కొనుగోళ్ళు సోమవారం నుంచి నిలిచిపోనున్నాయి. సీసీఐ, జిన్నింగ్ మిల్లులను ఎల్-1, ఎల్-2, ఎల్-3 గ్రేడులుగా విభజించి కొనుగోళ్ల చేస్తుండడం, కపాస్ కిసాన్ మొబైల్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవడం లాంటి నిబంధనలను విధించడంపై నిరసన తెలుపుతున్నారు. రాష్ట్రంలోని అన్ని జిన్నింగ్ మిల్లులకు పని కల్పించే విధంగా పత్తి కొనుగోళ్లు చేపట్టాలని తెలంగాణ కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేస్తున్నది. ఈ అసోసియేషన్ చేసిన డిమాండ్‌ను ప్రభుత్వం పరిశీలించక పోవడంతో ఈనెల 17 నుంచి పత్తి కొనుగోళ్లు నిలిపివేయాలని నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా జిన్నింగ్ మిల్లుల సంక్షేమ సంఘం ఈ బంద్‌కు పిలుపు ఇవ్వడంతో కొనుగోళ్లు నిలిచిపోనున్నాయి.

● నిలిచిపోనున్న సీసీఐ కొనుగోళ్లు

ఈనెల 6 నుంచి బంద్ చేపట్టాలని సంఘం నిర్ణయించినా మార్కెటింగ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అందుబాటులో లేని కారణంగా దానిని వాయిదా వేశారు. ప్రస్తుతం 17 నుంచి జిన్నింగ్ మిల్లులు బంద్ పాటిస్తున్నందున సీసీఐ కొనుగోళ్లు బంద్ కానున్నాయి. ప్రతి యేటా అక్టోబరు మొదటి వారంలో సీసీఐ కొనుగోళ్లను ప్రారంభిస్తుంది. వర్షాల కారణంగా పత్తిలో తేమ అధికంగా ఉండడంతో నవంబరులో కొనుగోళ్లు ప్రారంభించారు. జిల్లాలో ఇప్పటి వరకు సీసీఐ ఆరు వేల క్వింటాళ్ల మేరకే పత్తి కొనుగోలు చేసింది. జిల్లాలో 50 వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. సాధారణ పరిస్థితుల్లో ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అకాల వర్షాల కారణంగా కొంత పంట దెబ్బతినడంతో ఎకరాకు 7 నుంచి 10 క్వింటాళ్ల మేరకు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కనీసం 3.5 లక్షల క్వింటాళ్లు, గరిష్ఠంగా ఐదు లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని భావిస్తున్నారు.

● నత్తనడకన..

ఇప్పటి వరకు సీసీఐ ఆరు వేల క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేయగా, ప్రైవేట్ వ్యాపారులు మరో 50వేల క్వింటాళ్ల కొనుగోలు చేసి ఉంటారని అంచనా వేస్తున్నారు. కనీసం ఎకరాకు ఏడు క్వింటాళ్ల చొప్పున దిగుబడి వచ్చినా మరో మూడు లక్షల క్వింటాళ్ల మేరకు పత్తి కొనుగోలు చేయాల్సి ఉన్నది. సీసీఐ కపాస్ ఆప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని జిన్నింగ్ మిల్లులకు పత్తి తీసుకొని రావాలి అనే నిబంధనలు విధించడంతో ఎల్-1 మిల్లుల బుకింగ్ పూర్తయిన తర్వాతే ఎల్-2 మిల్లుల స్లాట్ బుక్ అవుతుంది. ఇలాంటి సమస్యలతోపాటు తేమశాతం ఎక్కువగా ఉందని కొనుగోలు చేయక పోవడం సమస్య కూడా ఉత్పన్నమవుతున్నది. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు పత్తిని విక్రయించుకోవలసి వస్తోంది. పత్తి కనీస మద్దతు ధర క్వింటాల్‌కు 8,110 రూపాయలు ఉండగా ప్రైవేట్ వ్యాపారులు 5,500 నుంచి ఆరు వేల రూపాయల వరకు చెల్లిస్తున్నారు. డబ్బులు అవసరమున్న వారు తప్పనిసరి పరిస్థితుల్లో అమ్ముకోవాల్సి వస్తోంది. ధర రాకున్నా చేతికి వచ్చిన పత్తిని అమ్ముకొని దానిని నిల్వచేసే సమస్యను తప్పించుకుందామనుకున్నా జిన్నింగ్ మిల్లులు నిరవధికంగా కొనుగోళ్లు నిలిపివేయనున్న నేపథ్యంలో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అకాల వర్షాలు కురిస్తే పత్తి తడవడంతోపాటు తేమ పెరిగి ఇప్పుడు లభిస్తున్న ధర కూడా రాకుండా పోతుందేమోనని భయ పడుతున్నారు. ప్రభుత్వం జిన్నింగ్ మిల్లుల యజమానుల సంక్షేమ సంఘంతో చర్చించి వెంటనే కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఓటరు జాబితా సవరణలో మార్గదర్శకాలను పాటించాలి

కరీంనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. శనివారం ఆయన హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ పెండింగ్ పనులను వేగంగా పూర్తిచేసి ఓటరు జాబితాను మరింత మెరుగు పరిచే దిశగా పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.

నారాయణపూర్ ముంపు భూములకు రూ. 23.5 కోట్ల పరిహారం

కరీంనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): గంగాధర మండలం నారాయణపూర్ జలాశయం, కెనాల్ ముంపు భూముల రైతులకు 23.50 కోట్ల రూపాయల పరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీపాదసాగర్ ఎల్లంపల్లి ప్రాజెక్టు స్టేజీ-2 ద్వారా నారాయణపూర్, స్తంభంపల్లి చెరువుల విస్తరణ, నారాయణపూర్ నుంచి వేములవాడ, స్తంభంపల్లి చెరువులకు గ్రావిటీ కెనాల్ నిర్మాణం కోసం భూములను సేకరించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక కృషితో పరిహారం చెల్లింపునకు ప్రభుత్వానికి విన్నవించడంతో ఈ నిధులు మంజూరు అయ్యాయి. భూములు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం ఈ నిధులను మంజూరు చేసింది.

ప్రత్యేక లోక్ అదాలత్‌లో 196 కేసుల పరిష్కారం

కరీంనగర్ క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన స్పెషల్ లోక్ అదాలత్‌లో 196 కేసులు పరిష్కరించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి న్యాయమూర్తి రాణి తెలిపారు. వీటిలో రాజీ చేయదగిన క్రిమినల్ కేసులు 170, చెక్ బౌన్స్ కేసులు 24, యాక్సిడెంట్ పరిహారం కేసులు ఒకటి, సివిల్ కేసు ఒకటి ఉన్నట్లు న్యాయమూర్తి తెలిపారు. చెక్ బౌన్స్ కేసుల్లో 30.51 లక్షలు, మోటారు ప్రమాద పరిహారం కేసులో 4.85 లక్షల రూపాయలను బాధితులకు పరిహారంగా ఇప్పించామన్నారు.

రేపు జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ కేహెచ్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలను నిర్వహించ నున్నారు. అండర్-11, 13, 15, 17, 19, మహిళలు, పురుషుల విభాగాల్లో ఈ పోటీలను నిర్వహించనున్నామని టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శరత్‌కుమార్‌రెడ్డి, కేహెచ్ఆర్ డైరెక్టర్ గౌతమ్‌రెడ్డి తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డు జిరాక్స్‌తోపాటు ఒక పాస్‌పోర్టు సైజ్ ఫోటోను వెంట తీసుకు రావాలని సూచించారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు.వివరాలకు 7093793750 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

జమ్మికుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక బాలికల పాఠశాలలో ఇటీవల మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయంపై పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాస్ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఎంఈవో హేమలత విచారణ జరిపి డీఈవో శ్రీరామ్ మొండయ్యకు నివేదిక సమర్పించారు. మధ్యాహ్న భోజనం ప్రభుత్వ పథకమని తెలిసినా శ్రీనివాస్ ఉద్దేశపూర్వకంగా తప్పుడు పోస్టులు పెట్టారని నివేదికలో పేర్కొన్నారు. ఈ మేరకు ఉపాధ్యాయుడును శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తూ డీఈవో శ్రీరామ్ మొండయ్య ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలోని మధ్యాహ్న భోజన నిర్వాహకులను మార్చారు. సోమవారం నుంచికొత్త వారితో మధ్యాహ్న భోజనం తయారు చేయించనున్నారు.

20 నెలలుగా నిరీక్షణ

- రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కోసం ఎదురు చూస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు
- ప్రభుత్వంపై ఒత్తిడికి సిద్ధమవుతున్న సంఘాలు
- రేపు హైదరాబాద్‌లో మహాధర్నా



కరీంనగర్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను మంజూరు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తుండడంతో ఉద్యోగ విరమణ పొందిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బెనిఫిట్స్‌ను వినియోగించుకొని శేష జీవితాన్ని గడుతామనుకుంటున్న వారి కల కలగానే మిగులుతోంది. 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు రిటైర్ అయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు జమచేసుకున్న డబ్బులతోపాటు వారికి రావలసిన బెనిఫిట్స్ ఇవ్వలేదు.. రాష్ట్రవ్యాప్తంగా మార్చి 2024 నుంచి ఇప్పటి వరకు రిటైర్ అయిన ఉద్యోగుల్లో 26 మంది పెన్షనర్లు ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక అనారోగ్యాలకు గురై మృతిచెందినట్లు రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (రేవా) ప్రకటించింది. ఎన్నాళ్లు ఈ ఆర్థికభారాన్ని మోయాలని వారు ప్రశ్నిస్తున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు 30 నుంచి 40 సంవత్సరాలు పని చేసి తమ సర్వీసులో పొదుపు చేసిన డబ్బులతోపాటు, పదవీ విరమణ పొందిన వెంటనే రావలసిన టీజీపీఎఫ్, టీజీఎల్ఐ, జీఐఎస్ ఏ ఒక్కటి మంజూరు చేయలేదు. లీవ్ ఎన్‌క్యాష్ మెంట్, ఉద్యోగుల హక్కు అయిన కమ్యూటేషన్, గ్రాట్యుటీ డబ్బు అందకపోవడంతో పెన్షనర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఒక్కో ఉద్యోగికి జీపీఎఫ్ డబ్బులు 10 లక్షల నుంచి 20 లక్షల రూపాయల వరకు స్తాయి. ఈఎస్‌జీఎల్ఐ కింద మూడు లక్షల నుంచి ఐదు లక్షల వరకు ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. ఇలా 30 ఏళ్ల పైన సర్వీసు పూర్తి చేసి పదవీ విరమణ

(మిగతా 8వ పేజీలో)

రాష్ట్రంలో 26 మంది పెన్షనర్లు మరణించారు

- కోహెడ చంద్రమౌళి, రేవా రాష్ట్ర కన్వీనర్

మార్చి 2024 నుంచి ఇప్పటి వరకు పదవీ విరమణ చేసిన ఉద్యోగుల్లో ఆర్థిక ఇబ్బందులు, వైద్య ఖర్చులు, ఇతరత్రా అవసరాలను తీర్చుకోలేక రాష్ట్రంలో 26 మంది రిటైర్డ్ ఉద్యోగులు మృతి చెందారు. అనేక మంది పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కోసం కళ్లలో వత్తులు వేసుకొని చూస్తున్నారు. రేవా ఆధ్వర్యంలో ప్రభుత్వానికి చాలా సార్లు వినతిపత్రాలను సమర్పించాము. అయినా ప్రభుత్వం కనీస స్పందన లేకుండా ఉసురు తీస్తోంది. పెన్షన్ బెనిఫిట్స్‌ను వెంటనే ప్రభుత్వం మంజూరు చేయాలని ఈనెల 17న తలపెట్టిన మహాధర్నాతో ప్రభుత్వంపై ఒత్తిడి తేవడమే కాకుండా తమకు న్యాయం చేసే వరకు పోరాటం చేస్తాము.

కుక్క, కోతి కాటుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

● కలెక్టర్ పమేలా సత్పతి



వృద్ధురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

సుభాష్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కుక్క, కోతి కాటుకు గురైన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి వైద్య సిబ్బందికి సూచించారు. నగరంలోని హౌ సింగ్ బోర్డు కాలనీలోని ఆరోగ్య కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుక్క, కోతి కాటుకు గురైన వారిని కోర్సు పూర్తయ్యే వరకు నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విటమిన్ గార్డెన్స్‌పై బయోసైన్స్ ఉపాధ్యాయులు దృష్టి సారించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శనివారం హౌసింగ్ బోర్డు కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. ప్రతి పాఠశాలలో స్నేహిత బోర్డులు, విద్యార్థుల కెరియర్ చార్ట్ తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, విద్యాశాఖ కో-ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత మహిళలకు అండగా భరోసా కేంద్రం

● పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం



అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బాధిత మహిళలకు భరోసా కల్పించడంలో భరోసా కేంద్రం కీలక పాత్ర పోషిస్తున్నదని పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం అన్నారు. జిల్లా పోలీసు కమీషనర్ గౌస్ ఆలం శనివారం నగరంలోని భరోసా కేంద్రాన్ని సందర్శించి, కేంద్రం పనితీరును సమీక్షించారు. భరోసా కేంద్రం బాధితులకు అందించిన సేవలు, వాటి ఫలితాలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. గత సంవత్సరం డిసెంబరు 22న అప్పటి డీజీపీ డాక్టర్ జితేందర్ ప్రారంభించిన ఈ కేంద్రం, మహిళలు, చిన్న పిల్లలపై లైంగిక వేధింపులు లేదా చిత్రహింసలకు గురైన సందర్భాలలో బాధితులకు ఒకేచోట న్యాయ సహాయం, వైద్యం, సైకోథెరపీ అందించే లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, ఎస్ఐ మనీషా పాల్గొన్నారు.

21న ఖేలో ఇండియా అస్మిత పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో అస్మిత లీగ్-2025 అథ్లెటిక్స్ పోటీలను ఈ నెల 21న నిర్వహించనున్నారు. ఈ నెలలో జరగనున్న ఖేలో ఇండియా అస్మిత టాలెంట్ హంట్ పోటీలకు ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, అథ్లెటిక్స్ అసోసియేషన్ కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు మహిపాల్ తెలిపారు. అండర్-14, 16 విభాగాల్లో బాలికలకు మాత్రమే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్, రెవెన్యూ జారీ చేసిన ఒరిజినల్ డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని పేర్కొన్నారు.

● అండర్-14 బాలికలు

ట్రయాథ్లన్- ఎ (60 మీటర్లు రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్), ట్రయాథ్లన్-బి (60 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్, బ్యాక్ త్రో), ట్రయాథ్లన్-సి (60 మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్, 600 మీటర్ల కిడ్స్ జావెలిన్) పోటీలు నిర్వహించనున్నారు. 21-12-2011 నుంచి 20-12-2013 మధ్య జన్మించినవారు అర్హులు.

● అండర్-16 బాలికలు

60 మీటర్లు, 600 మీటర్ల రన్నింగ్, హైజంప్, లాంగ్ జంప్, డిస్కస్ త్రో, 3 కేజీల షాట్‌పుట్, 500 గ్రాముల జావెలిన్ త్రో పోటీలు నిర్వహిస్తారు. 21-12-2009 నుంచి 20-12-2011 మధ్య సన్మించినవారు అర్హులు.

అన్నింటా సగం..



బ్లూ కోల్ట్స్ విధుల్లో, డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు

- బ్లూకోల్ట్స్ విధుల్లో మహిళా పోలీసులు
- క్షేత్రస్థాయిలో కీలకమైన విధులు
- పురుషులతో సమానంగా సేవలు

కరీంనగర్ క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్ కార్యాలయ విధులకే పరిమితమైన మహిళా పోలీసులు నేడు క్షేత్ర స్థాయిలో కీలక



వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు

బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రజలకు అత్యవసర సమయాల్లో, నేరాలు జరిగిన క్షణాల్లో సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకునేలా బ్లూ కోల్ట్స్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. బ్లూకోల్ట్స్‌లో పురుషులు మాత్రమే విధులు నిర్వర్తించే వారు. మహిళా సిబ్బంది క్షేత్రస్థాయిలో సైతం విధులు నిర్వహించాలని ప్రస్తుత పోలీసు కమిషనర్ గౌస్‌ఆలం నిర్ణయించారు. అందులో భాగంగా గత సెప్టెంబర్ 26వ తేదీ నుంచి కమిషనరేట్ వ్యాప్తంగా మహిళా పోలీసులు బ్లూ కోల్ట్స్ విధుల్లో పాల్గొంటున్నారు.

● నేరాలు, మోసాలపై అవగాహన

రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. సైబర్ నేరం జరిగితే వెంటనే మొదటి గంటలోపే (గోల్డెన్ అవర్‌లో) 1930కి ఫోన్ చేస్తే ఆ సొమ్మును ఫ్రీజ్ చేసేలా చర్యలు తీసుకుంటారు. ఈఅంశాలతో పాటు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే నష్టాలూ, రోడ్డు ప్రమా దాల నివారణకు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వలన కలిగే నష్టాలు వివరిస్తున్నారు. మహిళల భద్రత, ఒంటరిగా ప్రయాణ సమయాల్లో తీసుకో వాల్సిన జాగ్రత్తలు, సోషల్ మీడియా వేదికగా జరిగే మోసాలపై, నేరాల నియంత్రణ కొరకు పోలీసులు తీసుకుంటున్న చర్యల గురించి ప్రజలకు వివరిస్తున్నారు.

● గ్రామ పోలీసు అధికారిగా విధులు

ముఖ్యంగా మహిళలకు సంబంధించిన సమస్యలపై మహిళా సిబ్బంది అవగాహన కల్పించడంతో సత్ఫలి తాలు వస్తున్నాయి. మహిళా పోలీసు కానిస్టేబుళ్లు, పురుష పోలీసులతో సమానంగా రాణిస్తున్నారు. పాయింట్ బుక్ చెకింగ్స్, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలపై ఆరాతీయడం, విలేజ్ పోలీసు అధికారిణిగా రాణించడం, గ్రామ పంచాయతీల వద్ద, పబ్లిక్ స్థలాల్లో పోలీసుల ద్వారా పొందే సేవలను గోడపత్రికలు అతికించి స్థానిక ప్రజలకు తెలియజేయడం వంటి విధులు నిర్వహిస్తున్నారు. మహిళా సిబ్బంది కూడా బ్లూకోల్ట్స్ సేవల్లోకి రావడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునే సమయం సగటున ఏడు నిమిషాలుగా ఉన్నది. మహిళా బ్లూ కోల్ట్స్ పోలీసుల స్థానిక సమావేశాలు ప్రజల్లోకి నేరుగా చేరుతున్నాయి.

● సీపీఆర్ విధానంపై శిక్షణ

మహిళా పోలీసు అధికారులు, సిబ్బందికి సెప్టెంబరు 26న ప్రభుత్వ వైద్యుల సమక్షంలో ప్రత్యేకంగా కమిషనరేట్ కేంద్రంలోని అస్త్ర కన్వెన్షన్ హాలులో అకస్మాత్తుగా గుండెపోటు సంభవించిన వ్యక్తికి ప్రథమ చికిత్సలో భాగంగా సీపీఆర్ నిర్వహించే విధానంపై శిక్షణ అందించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే మహిళా బ్లూ కోల్ట్స్ పోలీసులకు అన్ని అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు సీపీ తెలిపారు.

సమర్థవంతమైన సేవలు అందించేలా శిక్షణ

- గౌస్ ఆలం, పోలీస్ కమిషనర్

మహిళా పోలీసులు పురుషులకు దీటుగా సమర్థవంతమైన సేవలు అందించేలా తీర్చిదిద్దుతున్నాం. రానున్న రోజుల్లో పోలీసుశాఖలో మహిళా అధికారులు, సిబ్బంది సంఖ్య మరింత పెరగనున్నది. మహిళా కానిస్టేబుళ్లు అన్నిరకాల విధులు సమర్థవంతంగా నిర్వర్తించేలా శిక్షణనిస్తున్నాం. ఈ చర్యలు సమానత్వానికి తోడ్పడుతాయి.

విద్యుదాఘాతంతో రైతు మృతి


జయసింహారెడ్డి(ఫైల్)

ముస్తాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవునూర్ గ్రామానికి చెందిన రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడని ఎస్సై సీహెచ్‌గణేశ్ శనివారం తెలిపారు. ఆయన తెలిపినవివరాల ప్రకారం.. ఆవునూర్ గ్రామానికి చెందిన బద్ది జయసింహారెడ్డి(65) అనేరైతు తన వ్యవసాయపొలం వద్ద పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు బోర్‌మోటార్ వైర్ తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కొడుకు భానుచందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

ప్రమాదవశాత్తు రైలు కింద పడి ఒకరి మృతి


సరేందర్(ఫైల్)

జమ్మికుంట రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన గుల్లి సరేందర్ (50) ప్రమాదవశాత్తు రైలు కింద పడి శనివారం మృత్యువాత పడ్డాడు. సరేందర్ సుతారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మూడేళ్ల క్రితం పక్షవాతం రాగా, కొద్ది నెలల క్రితం తిరిగి కోలుకున్నాడు. ప్రస్తుతం సుతారి పనిచేస్తున్నాడు. పనిలో భాగంగా మడిపల్లి వైపు వెళ్తున్నాడు. మార్గం మధ్యలో ఉన్న రైల్వేగేట్ వద్ద ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు ఢీకొని మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు.

బాలిక ఆకస్మిక మృతి


రెడ్డి అర్చన(ఫైల్)

సైదాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలం సర్వాయిపేట పంచాయతీ పరిధిలోని శివరాంపల్లిలో రెడ్డి అర్చన (16) ఆకస్మికంగా మృతిచెందింది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. శివరాంపల్లికి చెందిన అర్చన సోమారం మోడల్ స్కూల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతోంది. శుక్ర వారం సాయంత్రం తల్లిదండ్రులతో సరదాగా గడిపి రాత్రి నిద్ర పోయిన అర్చన ఉదయం లేచేసరికి మృతి చెంది ఉంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అర్చన తండ్రి రెడ్డి రాజు ఫిర్యాదుతో కేసుదర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం రిపోర్టుతో బాలిక మృతి కారణం తెలిసే అవకాశం ఉంది.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో శిక్ష పడుతుందని యువకుడి బలవన్మరణం


సూర విజయ్(ఫైల్)

చొప్పదండి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్‌డ్రైవ్‌కేసులో శిక్ష పడుతుందనే భయంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నరేష్‌రెడ్డి, విజయ్ తల్లి ఫిర్యాదు మేరకు... చొప్పదండి పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన సూరవిజయ్(28) చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. విజయ్‌కి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఈనెల 1న చొప్పదండి పోలీసులు డ్రంకెన్ డ్రైవ్‌తనిఖీలు చేస్తుండగా విజయ్ పట్టుబడ్డాడు. విజయ్‌పై కేసు పెట్టిన పోలీసులు శుక్రవారం కోర్టుకు తీసుకెళ్లారు. మేజిస్ట్రేట్ సెలవులో ఉండడంతో విజయ్‌తిరిగి ఇంటికి వచ్చాడు. వచ్చిన తర్వాత కేసులో శిక్ష పడుతుందని, ఫైన్ కట్టడానికి డబ్బులు లేవని భార్యతోవిజయ్ చెప్పాడు. మనస్తాపం చెందిన విజయ్ శనివారం ఉదయం ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విజయ్‌తల్లి నాగమ్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపు తప్పి టిప్పర్ బోల్తా

ఎల్లారెడ్డిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాల-రాగట్లపల్లి గ్రామాల మధ్య రహదారిలో అదుపుతప్పి టిప్పర్ వ్యవసాయ పొలంలో బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్ చాకచక్యంగా తప్పించుకోవడంతో ప్రాణాపాయం తప్పింది.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇక్కట్లు

● ఇసుక, కంకర ధరల పెరుగుదల


హుజూరాబాద్‌లో ఇసుక లేక మధ్యలోనే వదిలేసిన ఇందిరమ్మ ఇంటి పనులు



హుజూరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇసుక, కంకర ధరలు పెరగడం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులకు ఇబ్బందిగా మారింది. దీంతో కొందరు ఇళ్ల నిర్మాణ పనులు నిలిపివేశారు. రెండు నెలలుగా ఇసుక, కంకర ధరలను వ్యాపారులు ఇష్టానుసారంగా పెంచేశారు.ఇప్పటి వరకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదా రులకు చేసిన ఇళ్ల నిర్మాణాల ఆధారంగా డబ్బులు జమ చేసింది. ఆ డబ్బులు సరిపోవడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

హుజూ రాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట,వీణవంక మండలాల్లో మానేరు వాగు ప్రవహిస్తోంది. భారీ వర్షాలకు వాగు ప్రవ హించడంతో ఇసుక దొరకడం లేదు. దొరికిన ఇసుక ట్రాక్టర్‌కు రూ.5వేల చొప్పున దోపిడీ చేస్తున్నారు. దళారులే ధరలు పెంచుతు న్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. హు జూరాబాద్ నియోజకవర్గంలో జమ్మి కుంట, ఇల్లందకుంట, వీణవంక, హుజూరాబాద్, కమలాపూర్ మండలాలు ఉండగా, అందు లో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యా యి. ఆరునెలల క్రితం ట్రాక్టర్ ఇసుక రూ.2800నుంచి రూ.3వేల వరకు లభిం చింది. అంతేకాకుండా గృహ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఎక్కువగా జరుగుతుండడంతో క్రషర్ యజమానులు కంకర ధరలను కూడా పెంచేశారు. ఓ వైపు కంకర, మరో వైపు ఇసుక ధరలు పెంచడంతో సామా న్యులు ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక, కంకర దళారులను అరికట్టడంలో రెవెన్యూ, పోలీసులు విఫలమయ్యారనే ఆరోపిస్తున్నారు. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం ఇసు కను ఉచితంగా లేదా రాయితీపై అందించాల్సి ఉండగా పట్టించుకోవడ లేదు. దీంతో ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే ఆపేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక, కంకరను ఉచితంగా పంపిణీ చేయాలని కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సుల్తానాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టేపల్లి మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 12ట్రాక్టర్లను శనివారం రెవెన్యూసిబ్బంది, పోలీసులు పట్టుకున్నారు. కొంతకాలం నుంచి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతోపాటు పలు గృహాల నిర్మాణాలకు ఈ ప్రాంతంలోని మానేరువాగు నుంచి ఇసుకను ఉచితంగా ట్రాక్టర్ల ద్వారా రవాణాచేయడానికి అనుమతి ఉంది. ఉదయం8నుంచి సాయంత్రం 5గంటల వరకు మానేరువాగు నుంచి ఇసుక ట్రాక్టర్లు రవాణా చేయాల్సి ఉండగా, నిబంధనలకు వ్యతిరేకంగా తెల్లవారుజాము నుంచే ఇసుకను తరలిస్తున్నారు. అక్రమంగా తరలిస్తున్న ఇసుకను కొన్నిచోట్ల డంప్‌చేసి, అధికధరలకు విక్రయించుకుంటూసొమ్ము చేసుకుంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో అక్రమంగా ఇసుకతరలిస్తున్న 12ట్రాక్టర్లను పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అక్రమ రవాణా జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటామని ఆర్ఐ వినోద్ తెలిపారు.


పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 20మందికి గాయాలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 20మంది గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే..




లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు, ప్రమాద స్థలంలో రోదిస్తున్న మహిళ

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు..

మానకొండూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం సదాశివపల్లి వద్ద ఆర్టీసీ బస్సు లారీని ఢీకొన్న ఘటనలో 15మంది ప్రయాణికులు గాయపడ్డారు. నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శనివారం నిజామాబాద్ నుంచి వరంగల్‌కు బయల్దేరింది. మానకొండూర్ మండలంలోని సదాశివపల్లి బస్టాండ్ వద్ద కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న లారీ బ్రేక్ వేయడంతో వెనక నుంచి ఆర్టీసీ బస్సు దానిని ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో సీట్లలో కూర్చున్న 15మంది ప్రయాణికులు గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108వాహనంలో కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడ్డవారిలో నిజామాబాద్, జగిత్యాల, హుజూరాబాద్, వరంగల్ జిల్లాల ప్రయాణికులు ఉన్నారు. ఘటనలో బస్సు డ్రైవర్ వైపు ఉన్న అద్దం పగిలిపోయింది. ప్రమాదానికి గురైన బస్సును, లారీని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు వేగంగా వెళ్లవద్దని బస్సు డ్రైవర్‌కు సూచించినా పట్టించుకోలేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆటో ట్రాలీ బోల్తా పడి..

జమ్మికుంట : జమ్మికుంట మండలం తనుగుల శివారులో వ్యవసాయ కూలీలు ప్రయాణిస్తున్న ఆటో ట్రాలీ శనివారం ప్రమాదవశాత్తు బోల్తాపడింది. వీణవంక మండలం ఎల్బాక గ్రామానికిచెందిన 25మంది వ్యవసాయ కూలీలు జమ్మికుంట మండలం నాగారం గ్రామంలో పత్తి ఏరడానికి ఆటోట్రాలీలో ఉదయం ఇంటి నుంచి బయల్దేరారు. మార్గమధ్యలో తనుగుల శివారులోని గుంపుల క్రాస్‌రోడ్ వద్ద ప్రమాదవశాత్తు ఆటోట్రాలీ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడగా, మరో 21మందికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని 108అంబులెన్స్‌లో జమ్మికుంటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ రామకృష్ణగౌడ్ ఆసుపత్రికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రమాదం జరిగినట్లు పోలీస్‌లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి..

ఇల్లంతకుంట : మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన కూస అంజిరెడ్డి అనే ద్విచక్ర వాహనదారుడు రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పలను ఢీకొని గాయపడ్డాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రేపాక గ్రామంలో శనివారం జరిగిన వారసంతకు వెళ్లి తిరిగి ఇంటికి వెళతుండగా ధాన్యం కుప్పను ఢీకొట్టాడు. ప్రమాదంలో అంజిరెడ్డి గాయపడగా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఒకరి మృతి

ఎలిగేడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామపంచాయతీ ఎదుట గల చౌరస్తాలో శనివారం ఉదయం ఇసుక ట్రాక్టర్ ఢీకొని పెద్దేల్లి సుధీర్(50) మృతిచెందినట్లు ఎస్ఐ మధుకర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన సుధీర్ గర్రెపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో కాంట్రాక్టు ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజువారీగా ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా సుల్తాన్‌పూర్‌లో ఎదురుగా అతివేగంగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుధీర్ ఛాతిపై నుంచి ట్రాక్టర్ వెనుకటైర్లు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ శశికుమార్ అజాగ్రత్తగా వేగంగా నడపడం వల్లే ఈ దుర్ఘటన జరిగినట్లు ఆయన తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించగా, మృతుడి భార్య పెద్దేల్లి ఉమా ఫిర్యాదుమేరకు డ్రైవర్ శశికుమార్, యజ మాని ఆవుల సంపత్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు ఢీకొని ఒకరి మృతి

జగిత్యాలరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామశివారులో శుక్రవారం కారు బైక్‌ను ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న తాటిపల్లి గ్రామానికి చెందిన ఒజ్జల గంగాధర్(55) చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ కథనం ప్రకారం గంగాధర్ తన స్వగ్రామం తాటిపల్లి గ్రామం నుంచి జగిత్యాలకు పనినిమిత్తం బైక్‌మీద వెళ్తుండగా కారు ఢీకొట్టింది. తీవ్రగాయాలైన గంగాధర్‌ను జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి బంధువు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

దొంగతనాల కేసుల్లో ఆరుగురి అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న సీపీ గౌస్ ఆలం


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు, రాగితీగ

కరీంనగర్ క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాలోని గ్రామీణప్రాంతాల్లో కొన్ని నెలలుగా రైతులు, ప్రజల ఆస్తులకు నష్టం కలిగించిన, దొంగతనాల కేసులకు సంబంధించి పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలీ స్‌కమిషనర్ గౌస్‌ఆలం వివరాలు వెల్లడించారు. చొప్పదండి మండలంలోని గుమ్లాపూర్ చౌరస్తావద్ద శనివారం పోలీసులు వాహనతనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా వెళ్తున్న రెండు వాహనాలను తనిఖీచేయగా దొంగతనాలకు సంబంధించి నిందితులను పట్టుకున్నారు. చొప్పదండి, చిగురుమామిడి, మానకొండూర్, గంగాధర, కరీంనగర్‌రూరల్, రామడుగు, ఎల్ఎండీ, దుగ్గొండి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వారు 15దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. కట్టరాంపూర్‌కు చెందిన మనుపాటి శేఖర్, చొప్పదండికి చెందిన మనుపాటి సంజీవ్, బేగంపేటలోని రామగిరికి చెందిన ఉండాటి మహేశ్, ఇల్లంతకుంట మండలం వెల్జిపూర్‌కు చెందిన బోదాసు కుమార్, కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేట్‌కు చెందిన సాగర్ల రంజీత్, చొప్పదండికి చెందిన బొడిగే స్క్రాప్‌వ్యాపారి సంపత్(రిసీవర్)ను అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రెండు పికప్ వాహనాలు, ద్విచక్రవాహనం, 3క్వింటాళ్ల కాపర్ వైరు స్వాధీనం చేసుకున్నామని, వాటి మొత్తం విలువ సుమారు రూ.20 లక్షలుగా ఉంటుందని సీపీ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. కేసులకు సంబంధించి పరారీలో ఉన్న మిగతా 8మందికోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

● **సీపీ అభినందనలు**

కరీంనగర్‌రూరల్ ఏసీపీ విజయకుమార్ నేతృత్వంలో కేసులను చేదించగా బృందంలోని ప్రదీప్‌కుమార్(సీఐ చొప్పదండి), సంజీవ్ (సీఐ మానకొండూర్), నరేష్ రెడ్డి(ఎస్సై), వంశీకృష్ణ(ఎస్సై గంగాధర) సిబ్బంది అనిల్, రాజ్‌నాయక్, హేమసుందర్, శ్రీనివాస్, హసనొద్దీన్, రవీందర్, సృజన్‌ను సీపీ గౌస్ ఆలం అభినందించారు.

పోలీసుల పేరుతో దోపిడీకి పాల్పడిన నలుగురి అరెస్టు


నిందితులను అరెస్ట్ చూపుతున్న డీసీపీ కరుణాకర్

సుల్తానాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాతనేరస్తులు ఒక ముఠాగా ఏర్పడి పోలీసులమంటూ దోపిడికి పాల్పడి అడ్డంగా దొరికిపోయారు. పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ సుల్తానాబాద్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దొంగల అరెస్ట్‌ను చూపారు. డీసీపీ మాట్లాడుతూ రేగడిమద్దికుంటకు చెందిన నాగుల కుమారస్వామి, కాల్వశ్రీరాంపూర్ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన తిప్పని రవీందర్, పోవరి శ్యాంరావు, సుల్తానాబాద్ శాస్త్రీనగర్‌కు చెందిన పురుషోత్తం నాగరాజులు ముఠాగా ఏర్పడ్డారు. వారి అప్పులు తీర్చేందుకు గతంలో మావోయిస్టు పేరుతో డబ్బులు వసూలు చేసిన నాగుల కుమారస్వామి పోలీసుల పేరుతో దోపిడి చేయాలనే ఆలోచన చేశారు. నలుగురిలో ముఠా సభ్యుడైన పురుషోత్తమ నాగరాజు దోపిడీ కోసం గర్రెపల్లిలోని బంధువుల ఇంటినే ఎంచుకున్నారు. నలుగురు కలిసి ఈ నెల10న గర్రెపల్లిలోని సంగం లక్ష్మి ఇంటికి తెల్లవారుజామున చేరుకొన్నారు. తలుపులు తీసిన లక్ష్మితో తాము కరీంనగర్‌కు వన్‌టౌన్ పోలీసులమని, కరీంనగర్‌లో మీ కొడుకు రమేష్ పని చేస్తున్నాడని, అతని యజమాని దొంగనోట్ల వ్యాపారం చేస్తున్నాడని, అతనికి సంబంధించిన దొంగ నోట్లను ఇంట్లో దాచిన సమాచారం మేరకు ఇక్కడికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఇంట్లో నిద్రపోతున్న రమేష్‌ను లేపి చేతికి బేడీలను వేసి బీరువా తీయాలని బెదిరించి అందులోని బ్యాగును తీసుకొని, బంగారం, వెండి, నగదును తీసుకొని వెళతూ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు రావాలని పేర్కొన్నారు. అయితే వచ్చిన వారు నకిలీ పోలీసుల గ్రహించి బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీఐ సుబ్బారెడ్డి పర్యవేక్షణలో సుల్తానాబాద్, జూలపల్లి, కాల్వశ్రీరాంపూర్ ఎస్ఐలు శ్రావణ్‌కుమార్, సనత్‌రెడ్డి, వెంకటేష్‌లు బృందాలుగా విడిపోయి దొంగల ఆచూకీకి ప్రయత్నించగా శనివారం సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి వద్ద వారిని పట్టుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి రూ.11.50లక్షల విలువగల 115 గ్రాముల బంగారం, రూ.50వేల విలువగల 472 గ్రాముల వెండి, రూ10వేల నగదుతో పాటు దోపిడికి ఉపయోగించిన రెండు కార్లు, ఒకబైక్, పోలీస్ దుస్తులు, బేడీలను స్వాధీనం చేసుకున్నారు. దొంగలను పట్టుకోవడంలో కృషిచేసిన ఎస్ఐలతోపాటు హెడ్‌కానిస్టేబుల్ పలువురు పోలీసులకు డీసీపీ నగదు రివార్డులను అందజేశారు. సమావేశంలో ఏసీపీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని భర్త ఇంటి ఎదుట బైఠాయింపు

పెద్దపల్లి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి వివాహం చేసుకొని ఆరునెలల అనంతరం వద్దని చెప్పడంతో భర్త ఇంటి ఎదుట బైఠాయించి న్యాయం చేయాలని ఆందోళన చేసిన సంఘటన పెద్దపల్లి మండలంలో చోటుచేసుకుంది. బొంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మేరపల్లికి చెందిన బోదాసు అభిషేక్ అదేగ్రామానికి చెందిన దండుగుల శ్రీలతను ఆరునెలల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. ఆరునెలలపాటు ఇద్దరు కలిసి పెద్దపల్లిలో నివసించినట్లు తెలిపారు. కొన్నిరోజుల క్రితం పెళ్లిచేసుకున్న వ్యక్తి తననువద్దని తెలుపడంతో ఇంటిఎదుట బైఠాయించినట్లు పేర్కొన్నారు. స్థానిక పెద్దలసమక్షంలో ఒప్పందం కుదుర్చుకోవడంతో గొడవ సద్దుమనిగినట్లు తెలిపారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

భగత్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ స్టేట్‌రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జోనల్ సెక్రెటరీ జెజె రత్నం ఒక ప్రకటనలో కోరారు. ఆర్టీసీసంస్థలో 35నుంచి 40సంవత్సరాలు పనిచేసిన వారికి ఇబ్బందులు తపపడం లేదని తెలిపారు. 2017లో ఇవ్వాల్సిన పీఆర్‌సీ 2021లో ఇవ్వగా 2017నుంచి చెల్లిం చాల్సిన పీఆర్‌సీ ఏరియర్స్ ఇంతవరకు రాలేదని పేర్కొన్నారు. 2017లో రిటైర్డ్ అయిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు ఎనిమిది సంవత్సరాలు గడిచినా ఇంతవరకు రాలేదన్నారు. ప్రభుత్వం, ఆర్టీసీఅధికారులు చొరవ తీసుకోవాలని, ఆదుకోవాలని కోరారు.

గోదావరిఖనిలో గంజాయి విక్రయ ముఠా అరెస్టు

● 1.4కిలోల గంజాయి స్వాధీనం ● ఆరు సెల్‌ఫోన్లు సీజ్



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర బల్లార్ష నుంచి గోదావరిఖనికి గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తున్న ఆరుగురు సభ్యుల ముఠాను శనివారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. గోదావరిఖని కాకతీయనగర్‌కు చెందిన చిక్కుడు రాహుల్, పవర్‌హౌస్‌కాలనీకి చెందిన కొప్పులసాయి ధనుష్, మంచికట్ల అక్షయ్, సప్తగిరి కాలనీకి చెందిన మాటూరి సాత్విక్, అంతర్గాం రాజాపురంకు చెందిన చిలుక వినీత్, రామగుండం రైల్వే స్టేషన్ ఏరియాకు చెందిన బూక్య రాజేష్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1.4కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. వారు వినియోగిస్తున్న ఆరు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. స్థానిక కాకతీయనగర్‌కు చెందిన చిక్కుడు రాహుల్ కూలీ చేసుకుంటుండేవాడు. జల్సాలకు అలవాటు పడి బల్లార్ష నుంచి గంజాయి తీసుకువచ్చి గోదావరిఖని, ఇతర ప్రాంతాల్లో విక్రయించేవాడు. ఈ క్రమంలో గోదావరిఖని, రామగుండంకు చెందిన యువకులతో పరిచయం ఏర్పడింది. వీరంతా గంజాయికి బానిసలై గంజాయి రవాణా, విక్రయాలు జరుపాలని నిర్ణయించుకున్నారు. మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయించేవారు. శుక్రవారం కాకతీయనగర్ వాటర్ ట్యాంకు వద్ద గంజాయి అమ్మకాలకు ప్రయత్నిస్తున్న చిక్కుడు రాహుల్‌ను పట్టుకుని అతని వద్ద 900గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతడిచ్చిన సమాచారంతో కొప్పుల సాయి ధనుష్, చిలుక వినీత్, మంచికట్ల అక్షయ్, మాటూరి సాత్విక్, బూక్య రాజేష్‌లను పట్టుకుని వారి వద్ద 500గ్రాముల గంజాయిని స్వాధీన పర్చుకున్నారు. వీరిని పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్ఐ రమేష్, క్రైమ్‌పార్టీ సిబ్బంది హెడ్‌కానిస్టేబుళ్లు రమేష్, శ్రీనివాస్, సదానందం, కానిస్టేబుళ్లు ప్రకాష్, రమేష్, మధుకర్, మధుసూదన్‌లను సీఐలు ఇంద్రసేనారెడ్డి, రవీందర్‌లు అభినందించారు.

మృతిపై ఫిర్యాదు

ముత్తారం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన సొన్నాయిల మధునయ్య(80) మృతిపై పలు అనుమానాలు ఉన్నట్లు కాసర్లగడ్డకు చెందిన అనుము రామస్వామి ముత్తారం పోలీసులకు శనివారం ఫిర్యాదులో పేర్కొన్నాడు. మృతుడి కుమార్తె మబ్బు స్నేహలత తండ్రి అనారోగ్యంతో బాధ పడుతున్నాడని ఈ నెల 14న ఆమె వెంట తీసుకెళ్లిందని, అదే రోజు సాయంత్రం మధునయ్య ఆరోగ్యం బాగాలేదని మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నాడు. చికిత్స పొందుతూ మరణించాడని స్నేహలత తెలిపారని రామస్వామి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆయన మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ పోస్టుమార్టం జరిపించాలని మంథని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

హైందవ ధర్మాన్ని కాపాడుకునేందుకు కృషి చేయాలి

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి, తదితరులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): హైందవ ధర్మాన్ని కాపాడుకునేందుకు కృషి చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలోని శ్రీ పార్వతి రాజరాజేశ్వరస్వామి ఆలయంలో కాలభైరవస్వామి, సంతాన నాగేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపిలు వేర్వేరుగా హాజరై స్వామివారి సన్నిధుల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ హిందువులు హైందవ ధర్మం పరిరక్షణకు కృషి చేయాలన్నారు. వేములవాడలో రాజరాజేశ్వరస్వామి ఆలయంలో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. పురాతన దేవాలయాలు, హైందవ ధర్మాన్ని కాపాడుకునేందుకు కృషిచేయాలన్నారు. అంతకు ముందు ఆలయంలో యంత్ర ప్రతిష్ఠ, పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం, శివపార్వతుల కల్యాణం, స్వామి వారి పల్లకి సేవ కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

దర్శనాలకు నిలయం.. భీమేశ్వరాలయం

- విశాలంగా ఆలయ ఆవరణ
- కోడెల మొక్కులు సులభతరం
- భక్తుల రద్దీకి అనువైన స్థలం
- రథశాలలోకి ఆర్జిత సేవల బుకింగ్ కార్యాలయం
- భీమేశ్వర సదన్‌లో అధికారిక కార్యకలాపాలు



భీమేశ్వరాలయంలో భక్తులు (ఫైల్)

ముఖ్య బుకింగ్ కౌంటర్

వేములవాడ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో విస్తరణ పనుల నేపథ్యంలో దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేయడంతో భీమేశ్వరాలయం భక్తులకు కేంద్రమైంది. ప్రస్తుతం భీమేశ్వరాలయంలో భక్తుల దర్శనాలు సులభం అవుతోంది. ఆలయంలో విశాలమైన ఆవరణ ఉండడంతో కోడెల మొక్కులు చెల్లించే భక్తులకు అనువుగా ఉంది. దీంతో స్పెషల్ కోడే, సాధారణ కోడె మొక్కులు చెల్లించే భక్తులకు ఇక్కట్లు తగ్గాయి. వేలాది మంది భక్తులు వచ్చినా దర్శనం చేసుకునే అవకాశం ఉంది.

● రథశాల వద్ద ముఖ్య బుకింగ్ కౌంటర్

భీమేశ్వరాలయంలో ఆర్జిత సేవలు నిర్వహించే భక్తులకు ముఖ్య బుకింగ్ కౌంటర్‌ను రథశాలకు మార్చారు. గత ఆది,



ఉత్తరం వైపు ఏర్పాటు చేసిన రేకుల ఫెన్సింగ్

సోమవారాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఆర్జిత సేవలు చేసుకునే భక్తు లకు టికెట్ తీసుకోవడం గగనమైంది. బుకింగ్ కౌంటర్‌లో భక్తులు తోసుకోవడంతో క్యూలైన్ బారీకేడ్ పక్కకు జరిగిపోయింది. దీంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. భక్తుల సౌకర్యార్థం అధికారులు రథశాల వద్ద ముఖ్య బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేశారు. ఈ కౌంటర్‌లో అన్ని ఆర్జిత సేవల టికెట్లు తీసుకొని పూజలు చేసుకోవచ్చు.

● భీమేశ్వర సదన్‌లో అధికార కార్యకలాపాలు

పాత భవనాలన్నీ తొలగించడంతో భీమేశ్వర సదన్‌లో అధికార కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. గత నెల నుంచి సదన్ పైఅంతస్తులో ఈవో కార్యాలయం ఏర్పాటు చేశారు. కింది అంతస్తులో ఇంజనీరింగ్ కార్యాలయం ఏర్పాటు చేసి కార్యకలాపాలు సాగిస్తున్నారు. భీమేశ్వర గెస్ట్ హౌజ్-1లో ప్రోటోకాల్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఇందులో వివీపీలు, ఇతర సిఫారసు లేఖలు ఉన్న వారు సంప్రదిస్తే దర్శనం ఏర్పాట్లు చేస్తారు. మరో భీమేశ్వర గెస్ట్ హౌజ్-3లోకి ప్రసాదాల తయారీ కేంద్రం ఏర్పరచి లడ్డూలు, పులిహోర ప్రసాదాలు తయారుచేస్తున్నారు.

పాఠశాలల మూసివేత తగదు

● కిష్టంపేట పాఠశాలను సందర్శించిన తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ

చందుర్తి నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలను మూసివేయడం తగదని తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ రాష్ట్రఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రొఫెసర్ కె లక్ష్మీనారాయణ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం కిష్టంపేట ఉన్నతపాఠశాలను మూసివేయడాన్ని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీబృందం సభ్యులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రెండువేల జనాభా కలిగిన గ్రామంలో పాఠశాలకు రావలసిన వయసు కలిగిన విద్యార్థులు దాదాపు 200మంది వరకు ఉన్నప్పటికీ పాఠశాలలో విద్యార్థులు లేరని మూసివేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సందర్భంలో పాఠశాలలు మూసివేయమని గతంలో మూతబడిన పాఠశాలలను ఒక్క విద్యార్థి ఉన్న తెరుస్తామని వాగ్దానం చేశారు. కానీ గత రెండు సంవత్సరాలుగా రాష్ట్రంలో వేలాది పాఠశాలలను విద్యార్థుల సంఖ్య తగ్గిందని, విద్యార్థులు రావడంలేదని అనేక పాఠశాలలను మూసివేశారన్నారు. దీనిని విద్యాపరిరక్షణకమిటీ తీవ్రంగా నిరసిస్తున్నదన్నారు. ప్రస్తుతం కిష్టంపేట పాఠశాలలో అన్ని సౌకర్యాలు గదులు తగినంత మంది ఉపాధ్యాయులు ఉన్నందున జిల్లా విద్యాధికారి, కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని పాఠశాలను పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర సహాధ్యక్షులు వై అశోక్ కుమార్ సహ ప్రధాన కార్యదర్శి ఎం రఘుశంకర్‌రెడ్డి, కార్యదర్శి కే రవిచందర్, డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ బూర సదానందం, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్కుర్తి అంజయ్య, డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి వంగ తిరుపతి, ఉపాధ్యాయ ఐకాస జిల్లా కో-కన్వీనర్ విక్కుర్తి లక్ష్మీనారాయణ, గ్రామ మాజీ సర్పంచ్ కొమ్ము రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కిష్టంపేట పాఠశాలను సందర్శించిన రాష్ట్ర విద్యా పరిరక్షణ కమిటీ బృందం

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్యం చేస్తున్న చిన్నారులు

ధర్మపురి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆవరణలోగల శేషప్ప కళావేదిక పై హైదరాబాద్ పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒడిస్సి కూచిపూడి నృత్యప్రదర్శన శనివారం ఆకట్టుకుంది. రాష్ట్ర ప్రభుత్వం పక్షాన దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉత్తర్వుల ప్రకారం పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూడిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించడానికి ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ మాజీచైర్మన్ సంగనభట్ల దినేష్, ఆలయఈవో సంకటాలశ్రీనివాస్, వేదపండితులు, అర్చకుల చేతుల మీదుగా జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. గంటల తరబడి చిన్నారులచే నిర్వహించిన ఒడిస్సి కూచిపూడి నృత్యప్రదర్శనలను భక్తులు ఎంతో ఓపికతో తిలకించారు.

చిన్నారులను ఆలయం పక్షానచైర్మన్, ఈవో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కురవీందర్, ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ మాజీ చైర్మన్ సంగనభట్ల దినేష్ తదిత, అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద దంపతుల హత్య కేసులో సీబీఐ దర్యాప్తు ముమ్మరం

● మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకు నోటీసులు? ● ఇప్పటికే నిందితులను విచారించిన అధికారులు
● అప్పటి పోలీస్ అధికారులను విచారించే అవకాశం...

కోల్‌సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు గట్టు వామన్‌రావు, నాగమణి దంపతుల హత్య కేసులో సీబీఐ దర్యాప్తు ముమ్మరం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేసునమోదు చేసిన సీబీఐ విచారణ ప్రారంభించింది. రామగుండం పోలీస్ కమిషనరేట్ కేంద్రంగా ఈ విచారణ జరుపుతున్నారు. వామన్‌రావు తండ్రి కిషన్‌రావు నుంచి వాంగ్మూలం తీసుకున్న సీబీఐ అధికారులు హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. రెండు మాసాలుగా వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న పలువురిని ఇప్పటికే విచారించింది. ఈ విచారణలో భాగంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మంథని మాజీ ఎమ్మెల్యే పుట్టమధును విచారించాలని నిర్ణయించిన సీబీఐ ఆయనకు నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. పుట్టమధు సోమవారం గోదావరిఖనిలోని రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ప్రాంగణంలో సీబీఐ ఎదుట విచారణకు హాజరయ్యే అవకాశం ఉంది. సీబీఐకి చెందిన డీఎస్పీస్థాయి అధికారులు మధును విచారించనున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఇప్పటికే మధును విచారించాల్సిన అంశాలపై నోట్ సిద్ధం చేసుకున్నట్టు తెలుస్తున్నది. ఈ కేసులో ఏ3గా ఉన్న పుట్ట మధు మేనల్లుడు బిట్టును సీబీఐ అధికారులు విచారించారు. న్యాయవాద దంపతులను 2021 సెప్టెంబరు 17న మంథని కోర్టు నుంచి హైదరాబాద్‌కు వెళుతుండగా మార్గమధ్యలో రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని కల్వచర్ల వద్ద నడిరోడ్డుపై హత్య చేశారు. ఈ కేసులో అప్పటి కమిషరేట్ అడిషనల్‌డీసీపీ(అడ్మిన్) అశోక్ కుమార్ విచారణాధికారిగా వ్యవహరించారు. అప్పటి రామగిరి ఎస్ఐ మహేందర్, విచారణ అధికారి అశోక్‌కుమార్‌ను సీబీఐ విచారించే అవకాశం ఉంది.

ఈ కేసులో హైకోర్టు ఆదేశాల మేరకు పోలీస్ ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. ఐజీ, పోలీస్ కమిషనర్ ఎప్పటికప్పుడు కేసు పురోగతిని సమీక్షించారు. సుప్రీం కోర్టు ఆదేశాలతో సీబీఐ దర్యాప్తు జరుపుతుండడంతో ప్రాధాన్యం సంతరించుకున్నది. ఇప్పటికే ఫైళ్లను స్వాధీనం చేసుకున్న సీబీఐ పోలీస్ విచారణలోని లోపాలపై దర్యాప్తు చేస్తున్నట్టు తెలుస్తుంది.

విద్యా బోధనకు దూరం చేసే కార్యక్రమాలను రద్దు చేయాలి

● టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్

ఎల్లారెడ్డిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను విద్యా బోధనకు దూరం చేసే కార్యక్రమాలను ప్రభుత్వం రద్దు చేయాలని తెలంగాణ ప్రొగ్రెసివ్‌టీచర్స్‌ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్రఅధ్యక్షుడు చకినాల అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అనిల్‌కుమార్ హాజరై మాట్లాడారు. పాఠశాలల్లో పర్యవేక్షణకు డిప్యూటేషన్ పద్ధతిలో ఉపాధ్యాయులను నియమించకూడదన్నారు. గత పీఆర్సీ గడువుముగిసి రెండేళ్లు గడుస్తున్న నూతన పీఆర్సీని ప్రకటించకపోవడం ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమన్నారు. పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులను సకాలంలో చెల్లించకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమన్నారు. హక్కుల సాధనకు నిర్వహించనున్న ఉద్యమాలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని అనిల్ కుమార్ కోరారు. సమావేశంలో ఆ సంఘం ప్రతినిధులు రామచంద్రం, శ్రీనివాస్,సతీష్, గంగయ్య, రమేశ్, శ్రీకాంత్, సురేందర్‌పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో కార్తీక పూజలు



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు సందర్భంగా వేములవాడ భీమేశ్వర స్వామి ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. శనివారం ఆలయ ఈవో ఎల్. రమాదేవి, పట్టణ సీఐ వీరప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి భీమేశ్వరాలయ పరిసర ప్రాంతాలను పర్యవేక్షించారు. శని, ఆదివారం ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో రానున్నారు. కోడె క్యూలైన్, ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనం, లడ్డు కౌంటర్, ప్రోటోకాల్ ఆఫీస్ తదితర ప్రాంతాల్లో భక్తులకు ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా లేదా అని ఈవో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్పై ఎల్లాగౌడ్, డీఈ మధు రఘునందన్, ఏఈవో శ్రావణ్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం..


భీమేశ్వరాలయంలో శనివారం రాత్రి కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించి భక్తి ప్రపత్తిని చాటారు. మహిళలకు వాయినం అందజేశారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

ధర్మపురి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకొని ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహ హోమం, స్వామివారల నిత్యకళ్యాణం జరిపించి పూజలుచేశారు. యమధర్మ రాజు ఆలయం వద్ద గండదీపంలో నూనెపోసి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంవద్ద నాగదేవతకు, రావిచెట్టు ఆంజనేయస్వామివారికి అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు. అనేకమంది దీపాలు వెలిగించి భక్తి శ్రద్ధలతో పూజించారు. స్వామివారలకు ఆలయ వేదపండితులు బొజ్జరమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్ శర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నిత్య పూజలు,అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం పక్షానఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.



ధర్మపురిలో భక్తుల రద్దీ



కొండగట్టులో భక్తులు

కొండగట్టులో భక్తుల సందడి..

మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామిని శనివారం భక్తులతో సందడిగా మారింది. కార్తీకమాసం కావడంతో కావడంతో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బేతాళుడు, శ్రీరాములవారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

గోదావరి హారతి..

ధర్మపురి: కార్తీకమాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరిహారతి 25వరోజు శని వారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వేద పండితులు, అర్చకులు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జరమేష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య విశేష పూజలు నిర్వహించారు. రాత్రివేళలో మహిళలు దొప్పలో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలి పుణ్యప్రాప్తి పొందారు. కార్యక్రమంలో ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలిచైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు.



ధర్మపురి వద్ద గోదావరి హారతి

కొండగట్టులో పెద్దపల్లి జిల్లా వాసి కిడ్నాప్

● తప్పించుకొని పోలీసులకు ఫిర్యాదు

● ముగ్గురిపై కేసు

మల్యాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చిన పెద్దపల్లి జిల్లాకు చెందిన దోమల రమేశ్ అనే వ్యక్తి కిడ్నాప్ కాగా తప్పించుకొని వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఎల్కలపల్లికి చెందిన దోమల రమేశ్ అనే వ్యక్తి లోన్ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. కొన్ని నెలల క్రితం గడ్డి నాగరాజు, బూర బాబులకు భూమిపై పెద్ద మొత్తంలో రుణం ఇప్పిస్తానని రూ.పది లక్షల మేర వసూలు చేశాడు. రుణం ఇప్పించకపోవడంతో ఐదు నెలలుగా తమ డబ్బులు ఇవ్వాలని కోరుతున్నప్పటికీ ఇవ్వడం లేదు. దీంతో బుధవారం కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చిన రమేష్‌ను నాగరాజు, బాబు కారులో వేములవాడకు తీసుకెళ్లారు. అక్కడ ముడికే అంజయ్య అనే మరో వ్యక్తితో కలిసి రమేశ్‌ను హైదరాబాద్‌కు తరలించి ఓ హోటల్లో బంధించి డబ్బులు ఇవ్వాలని దాడి చేశారు. అనంతరం రమేశ్‌ను శుక్రవారం రాత్రి వేములవాడకు తీసుకువచ్చి ఓ గదిలో ఉంచగా శనివారం అక్కడి నుంచి తప్పించుకొని మల్యాల పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తనను కిడ్నాప్ చేసిన నాగరాజు, బాబు, అంజయ్యపై ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

18న ఉమ్మడి జిల్లా వక్ఫ్‌బోర్డు సమావేశం

కరీంనగర్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని షాదీఖానాలో ఈనెల 18న ఉదయం 11 గంటలకు ఉమ్మడి జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లాల మసీదు ఈద్గా, ఖబ్రస్తాన్ మేనేజిమెంట్ కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ అజ్మతుల్లా హుస్సేన్ జిల్లా పర్యటన సందర్భంగా సమావేశాన్ని ఏర్పాటు చేశామని, దీనికి ఉమ్మడి జిల్లాల మసీద్, ఈద్గా, కబ్రస్తాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు హాజరుకావాలని కోరారు.

పీజీ కోర్సుల్లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

గణేశ్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళాడిగ్రీ కళాశాల కరీంనగర్‌లో 2025-26 విద్యాసంవత్సరం పీజీ కోర్సుల్లో ఖాళీల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.వరలక్ష్మి ప్రకటనలో తెలిపారు. ఎంఏ(ఇంగ్లీష్), ఎంఏ (తెలుగు), ఎంకాం, ఎమ్మెస్సీ(బోటనీ), ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ), ఎమ్మెస్సీ(ఫిజిక్స్), ఎమ్మెస్సీ(జువాలజీ) కోర్సుల్లో ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను కళాశాల కార్యాలయంలో ఈనెల17వ తేదీ సోమవారం సాయంత్రం 5గంటలలోపు అందజేయాలని తెలిపారు. 18వ తేదీన సిపిగేట్-2025 నిబంధనలప్రకారం అర్హతలు ఉన్న వారికి సీటు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్లో సీటులభించిన విద్యార్థినులకు ఫీజురీయింబర్స్‌మెంట్ వర్తించదని, నిర్ణీత ఫీజు కళాశాలలో చెల్లించాలని తెలిపారు. ఇతర వివరాలకు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

శ్రీరాంసాగర్‌కు స్థిరంగా ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం వరద నీరు స్థిరంగా వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతం నుంచి 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్‌భగీరథ, వరదకాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 9,454క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో ఎస్కేప్‌గేట్ల ద్వారా 8వేలక్యూసెక్కులు, సరస్వతీకాలువకు 650 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతోంది.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ యోగా పోటీలు ప్రారంభం

- ఉమ్మడి పది జిల్లాల నుంచి 330 మంది హాజరు
- పోటీలను ప్రారంభించిన డీఈవో శ్రీరామ్ మొండయ్య



యోగాసనాలు వేస్తున్న వివిధ జిల్లాల క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) యోగా పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. రామడుగు మండలం వెలిచాల జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పోటీలకు రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల నుంచి అండర్-14, 17 బాలబాలికలు, మొత్తం 260 మంది క్రీడాకారులు, 60 మంది అధికారులు, 30మంది అఫీషియల్స్ హాజరయ్యారు. పోటీలను జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ మొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు యోగాను ఒక క్రీడగానే కాకుండా నిత్య జీవితంలో భాగంగా ప్రతీరోజు అభ్యాసం చేయాలన్నారు. యోగాతో ఆరోగ్యం, ఆనందం పొందుతామన్నారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో విశేష ప్రతిభచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యేందుకు కృషి చేయాలన్నారు. జాతీయస్థాయి యోగా పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు విజేతలుగా నిలిచి చాంపియన్‌షిప్ సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి భగవంతయ్య, ఎంఈవో రంగనాథ శర్మ, వెలిచాల పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాజరాజేశ్వరి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బాసబోయిన వేణుగోపాల్, పోటీల రాష్ట్ర పరిశీలకులు సతీష్, శ్రీనివాస్, జిల్లావ్యాయామ ఉపాధ్యాయ సంఘం తెలంగాణ అధ్యక్షులు బాబు శ్రీనివాస్, నిర్వహణ కమిటీ బాధ్యులు వీర్ల హనుమంతరావు, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, వెలిచాల యూత్ సభ్యులు, నర్సింగరావు, స్థానిక ఫిజికల్ డైరెక్టర్ దత్తాద్రి శర్మ, జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు సిద్ధారెడ్డి, బాధ్యులు శర్మ, కోచ్ రామకృష్ణ, ఎస్‌జీఎఫ్ సభ్యులు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

20 నెలలుగా నిరీక్షణ

(5వ పేజీ తరువాయి)

చేసిన ఒక్కో ఉద్యోగికి 50 లక్షల నుంచి 75 లక్షల వరకు బెనిఫిట్స్ రావాల్సి ఉంది.

● **ఆందోళనకు సిద్ధమవుతున్న సంఘాలు**

ఉమ్మడి జిల్లాలో వెయ్యి మంది వరకు ఉద్యోగ, ఉపాధ్యాయులు పదవీ విరమణ చేశారు. రిటైర్ అయిన ఉద్యోగులు వారు జమ చేసుకున్న డబ్బులతోపాటు పెన్షన్ బెనిఫిట్స్ బకాయిలను విడుదల చేయక పోవడంతో రిటైర్డు ఉద్యోగ సంఘాలన్నీ ఏకమయ్యాయి. మరోవైపు 2024 మార్చి తర్వాత రిటైర్డు అయిన ఉద్యోగ, ఉపాధ్యాయులు కొత్తగా ఏర్పాటు చేసిన రిటైర్డు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (రేవా) ఇప్పటికే జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఆందోళనలు, ధర్నాలు చేపట్టింది. తాజాగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17న హైదరాబాద్‌లో మహాధర్నా కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించింది.

బ్లూబెల్స్‌లో స్వయం పరిపాలన దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 15, (ఆంధ్రజ్యోతి) : స్థానిక హనుమాన్‌నగర్‌లోని బ్లూబెల్స్ ఇన్నోవేటివ్ స్కూల్‌లో వనివారం స్వయం పరిపాలనా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలను కరస్పాండెంట్ జంగ సునీతా మనోహర్‌రెడ్డి ప్రారంభించగా 10వ తరగతి విద్యార్థులు ఒక్క రోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. అలాగే బాలల దినోత్సవం సందర్భంగా వారం రోజుల పాటు రోజుకు కొన్ని క్లాసుల చొప్పున పిక్నిక్ నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని శనివారం నగరంలో వయో వృద్ధుల దినోత్సవంపై అవగాహన కోసం ర్యాలీని నిర్వహించారు. జ్యోతిబా పూలే మైదానం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ కలెక్టరేట్ వరకు సాగింది. ర్యాలీలో ఆర్డీవో మహేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి కె.సబితకుమారి, మహిళలు, దివ్యాంగులు, పిల్లలు, సీనియర్ సిటిజన్లు, వివిధ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

కేశవపట్నం పోలీస్ స్టేషన్ తనిఖీ

శంకరపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేశవపట్నం పోలీసుస్టేషన్‌ను శనివారం సీపీ గౌస్ ఆలం తనిఖీ చేశారు. పోలీసుస్టేషన్ పనితీరు, పరిసరాలను, పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి, కేసు డైరీలను పరిశీలించారు. శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. హుజురాబాద్ ఏసీపీ మాధవి, రూరల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్, ఎస్సై శేఖర్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి బంగారు పతకం

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్‌కు వంతడుపుల రఘు టేకుమట్ల మండలంలోని పంగిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. భూటాన్ దేశం థింపు పట్టణంలో ఇంటర్నేషనల్ మాస్టర్స్ గేమ్స్‌లో హేమర్ త్రో విభాగంలో బంగారు పతకాన్ని సాధించారు.

ఆలయాల్లో కార్తీక శనివారం సందడి

కరీంనగర్ కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసంలో చివరి శనివారంతోపాటు ఏకాదశి కలసి రావడంతో నగరంలోని పలు వైష్ణవాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. మార్కెట్‌రోడ్, కట్ట రాంపూర్, విద్యానగర్, మంకమ్మతోట, భగత్‌నగర్ వేంకటేశ్వరాల యాలతో పాటు సప్తగిరి కాలనీ, వావిలాలపల్లి, గాంధీరోడ్, శ్రీరాంనగర్‌కాలనీ రామాలయాల్లో, యజ్ఞవరాహక్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఫిలింభవన్‌లో కొనసాగిన చిల్డ్రన్ ఫిలిం ఫెస్టివల్

కరీంనగర్ కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బాలల దినోత్సవం సందర్భంగా ఫిలింభవన్‌లో భాషా సాంస్కృతిక శాఖ, కఫిసో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిల్డ్రన్ ఫిలిం ఫెస్టివల్‌లో శనివారం సాయంత్రం పవనపుత్ర హనుమాన్ సినిమాను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కఫిసో ప్రధాన కార్యదర్శి, ఫెస్టివల్ కో ఆర్డినేటర్ లక్ష్మీగౌతమ్, ఉపాధ్యక్షుడు సయ్యద్ ముజాఫర్, తంగెడ అశోక్‌రావు పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక యజ్ఞవరాహక్షేత్రంలో మహాలక్ష్మీ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం శనివారంతో ఘనంగా ముగిసింది. ఉదయం అమ్మవారి మూల, ఉత్సవ మూర్తికి మహాభిషేకం, సాయంత్రం సహస్ర నామాలతో కుంకుమార్చన చేశారు. ఎస్‌వీఎస్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారార్ విద్యార్థుల క్షేత్ర పర్యటన

గణేశ్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ఆర్ట్స్ అండ్ సైన్స్ అటానమస్ కళాశాల కరీంనగర్ జంతు శాస్త్ర విభాగం ప్రథమ సంవత్సర విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని జింకల పార్కును సందర్శించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ మాట్లాడుతూ క్షేత్ర పర్యటనతో విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం పెరుగుతుందన్నారు. టీజీసీజీటీఏ రాష్ట్ర కార్యదర్శి సురేందర్ రెడ్డి, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

ఎస్సారార్ ప్రభుత్వ కళాశాలలో కార్తీక వన భోజనాలు

గణేశ్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం కార్తీక వనభోజనాలు నిర్వహించారు. వృక్ష శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ ఆదేశానుసారం కార్యక్రమం చేపట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, వృక్ష శాస్త్ర విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇరుకుల్ల ప్రభుత్వ పాఠశాల తనిఖీ

కరీంనగర్ రూరల్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్లలోని యూపీఎస్ పాఠశాలను శనివారం మండల విద్యాధికారి వాసవి తనిఖీ చేశారు. హాజరు శాతం, ఉపాధ్యాయుల హాజరు, డీఎస్సీ ఎఫ్ఆర్ ఎస్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు, రంగయ్య, సరళిదేవి, సీర్పా రవి చంద్ర తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌లోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల జాతీయ సేవా సంస్థ ప్రత్యేక శిబిరంలో భాగంగా శనివారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ప్రతీ వాడవాడనా తిరుగుతూ పర్యావరణ పరిరక్షణపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.. నీటి సంరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలన, మొక్కలు నాటడం, గృహ వ్యర్థ నిర్వహణ, మొక్కలు నాటడం, వంటి కార్యక్రమాలపై వివరించారు. కళాశాల జాతీయ సేవా సంస్థ విభాగం ప్రోగ్రాం ఆఫీసర్ గీతారాణి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి చెల్లింపులో ప్రభుత్వం విఫలం

గంగాధర, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాస్, నిరుద్యోగ భృతి చెల్లింపులో ప్రభుత్వం విఫలమైందని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. శనివారం గంగాధరలో నిర్వహించిన సంఘం సమావేశంలో మాట్లాడారు. రాజీవ్ యువ వికాస్ పథకంలో దరకాస్తు చేసుకున్న యువతను ప్రభుత్వం ఇప్పటి వరకు ఎందుకు ఎంపిక చేయలేదని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి అందిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్, మండల నాయకులు సంతోష్, చిరంజీవి, రఘు, విగ్నేష్, రాహుల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

- మరమ్మతులకు నిధులు మంజూరు
- ఒక్కో కేంద్రానికి రూ.2.50లక్షలు



బహదూర్‌ఖాన్ పేటలోని అంగన్‌వాడీ కేంద్రం

కరీంనగర్ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్రాలలో కనీస సౌకర్యాల కల్పించేందుకు అవసరమైన నిధులను మంజూరు చేసింది. కనీస సౌకర్యాలకు సంబందించిన పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఒక్కో అంగన్ వాడీ కేంద్రానికి 2.50లక్షల రూపాయలను మంజూరు చేయగా పనులు చురుగ్గా సాగుతున్నాయి. స్లాబ్ లీకేజీలు, కిటికీలు, తులుపులు బిగించడం, తాగు నీటి సౌకర్యం, సెలుపులు, మరుగు దొడ్ల నిర్మాణం వంటి పనులు చేపడుతున్నారు. కరీంనగర్ రూరల్ మండలంలో కొత్తగా మందులపల్లె అంగన్ వాడీ కేంద్రానికి 12లక్షల రూపాయలు మంజూరవగా, మందులపల్లె, మొగ్దుంపూర్ 1, మొగ్దుంపూర్ 2 కేంద్రాలకు, చెర్ల బూత్కూర్‌లోని 1,2, తహెర్ కొండాపూర్, ఎలబోతారం, జూబ్లీనగర్, ఫకీర్ పేట గ్రామాల్లోని అంగన్ వాడీ కేంద్రాలకు 2లక్షల చొప్పున మరమ్మతులకు ఎస్‌డీఆర్ఎఫ్ నిధులు కేటాయించారు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఆయా కేంద్రాల్లో పనులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల నిర్వహణ హైకోర్టులో స్టేఉండడంతో గామాల్లోని అంగన్ వాడీ కేంద్రాల్లో మరమ్మతులు చేపట్టిందుకు అదికారులు చర్యలు చేపట్టారు. బహదూర్‌ఖాన్ పేటలో ఫ్లోర్‌తో పాటు, కిటికిలు, తలుపులు, మరుగుదొడ్ల నిర్మాణం, అలాగే చరబూత్కూర్‌లో పుగోతలి ఉండగా, మొగ్దుంపూర్‌లో మరమ్మతు పనులు నిర్వహిస్తున్నారు. నిధులు మంజూరైన అన్ని గ్రామాల్లోని అంగన్ వాడీ కేంద్రాల్లో పనులు త్వరగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

నేటి నుంచి అన్నప్రసాద వితరణ

కరీంనగర్ కల్చరల్, నవంబరు 15, (ఆంధ్రజ్యోతి): స్థానిక భగత్‌నగర్ జడ్పీ క్వార్టర్స్ ఆవరణలో ఆదివారం నుంచి సుమారు 60 రోజులపాటు దాతల సహకారంతో భిక్ష ఏర్పాటు చేసినట్లు చైర్మన్ అనిల్‌కుమార్‌గౌడ్, ఈవో కొన్న కాంతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 20 ఏళ్లుగా కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రశాంతంగా యూజీ సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): యూజీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ శాతవాహన విశ్వ విద్యాలయ పరిధిలో నిర్వహించిన మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షలు శనివారం ప్రశంతంగా సాగినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ తెలిపారు. ఒకరు మాల్ ప్రాక్టిస్‌కు పల్పడినట్లు పేర్కొన్నారు.

రేపటి నుంచి పత్తికొనుగోళ్ల నిలిపివేత

చొప్పదండి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17 నుంచి సీసీఐ పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర జిన్నింగ్ మిల్లు అసోసియేషన్ పిలుపు మేరకు మండలంలో సీసీఐ, ప్రైవేట్ పత్తి కొనుగోళ్లను కూడా నిలిపివేస్తున్నట్లు వినతిపత్రాన్ని అందజేశారని ఆమె పేర్కొన్నారు. స్లాట్

యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి

కరీంనగర్ క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసు కోవాలని పోలీసు కమిషనర్ గౌస్ ఆలం అన్నారు. లయన్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో మధుమేహంపై అవగాహన కోసం పోలీసు సిబ్బందికి కమిషనరేట్ కేంద్రంలోని అస్త్ర కన్వెన్షన్‌లో 15 రోజుల యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం స్వయంగా యోగాసనాలు వేశారు. అనంతరం మాట్లాడుతూ యోగాతో శరీరం ఉత్తేజంగా పనిచేస్తుందని, శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. అడిషనల్ డీసీపీ భీంరావు, ఆర్ఐ శ్రీధర్‌రెడ్డి, సమన్వయకర్త రాధాకృష్ణ, ఐపీ ఎంసీసీ లయన్ హన్మాండ్ల రాజిరెడ్డి, డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ కోదండరాం, రమేష్, రాజు, రమేష్, రాజేందర్ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న 'కళా సిల్క్ చేనేత హస్తకళా' ప్రదర్శన



చీరలు కొనుగోలు చేస్తున్న మహిళలు

కరీంనగర్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీరాజరాజేశ్వర కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన కళా సిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శన ఆకట్టుకుంటోంది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పేరెన్నికైన చేనేత దుస్తుల అమ్మకాలతోపాటు స్టోన్, జువెల్లరీస్, కుర్తా, డ్రెస్ మెటీరియల్, డోర్ కర్టన్స్, పెరల్స్, ఉడెన్ హ్యాండ్ క్రాఫ్ట్, బంజారా కోల్‌కత్తా బ్యాగ్స్, జైపూరీ రాంజీ, ఒరిస్సా హ్యాండ్ క్రాఫ్ట్ వస్తువులు ప్రదర్శనలో లభిస్తాయి. గద్వాల, నారాయణపేట, పోచంపల్లి, ఉత్తరప్రదేశ్ జామ్‌దాని, బనారస్, లక్నో డ్రెస్ మెటీరియల్, రాజస్థాన్ కోట, బందన్, బ్లాక్ ప్రింట్స్, సంగ్నరి ప్రింట్స్ డ్రెస్‌మెటీరియల్, కర్నాటకలోని క్రేన్, ప్రింటెడ్ చీరెలు, మధ్యప్రదేశ్ చందేరి, మహేశ్వరి, జమ్ముకాశ్మీరులోని ఎంబ్రాయిడరీ చీరలు, పాస్మిన్‌శాల్, డ్రెస్‌మెటీరియల్, ఆంధ్రప్రదేశ్‌లోని ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి, ఉప్పడ చీరలు, అస్సాంలోని మూగా, ఎరిశిల్క్, బీహార్‌లోని బాగల్పూర సిల్క్, ట్రస్సర్, చత్తీస్‌గఢ్‌లోని ట్రిబుల్ వర్క్, కోన సిల్క్ చీరలు, గుజరాత్‌లోని బందాని, కచ్చ ఎంబ్రాయిడరీ డ్రెస్‌తోపాటు చీరలు, నేతన్నలు నేసిన చీరెలను ప్రదర్శన, అమ్మకాల కోసం అందుబాటులో ఉంచారు. మార్కెట్ ధరలకంటే తక్కువకు విక్రయిస్తుం డడంతో వినియోగదారుల నుంచి స్పందన లభిస్తోందని నిర్వాహకులు తెలిపారు. కళాకారులను ప్రోత్స హించేందుకు ప్రదర్శనను సందర్శించాలని, నచ్చిన వస్త్రాలు, వస్తువులను కొనుగోలు చేసి చేయూత నివ్వాలని కోరారు.

ఇన్‌చార్జి మంత్రి తుమ్మల జన్మదిన వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వ్యవసాయ శామంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు జన్మదిన వేడుకలు నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నగర కార్యాలయంలో సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుమ్మల నాగేశ్వర్‌రావు మున్ముందు ఉన్నత పదవులు అదిరోహించాలని ఆకాంక్షించారు. ఎండీ తాజ్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, లాయక్, దండి రవీందర్, అబ్దుల్ రహమాన్, షబానా మహమ్మద్, అస్థాపురం రమేష్, నాగుల సతీష్, మిరాజ్, మాసుం ఖాన్, ఆంజనేయులు, భారీ,బషీర్, ఖలీల్, నదీమ్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు



ప్రదర్శనను తిలకిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్

కరీంనగర్ కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్ మాట్లాడుతూ గ్రంథాలయాలను ఉపయోగించుకొని లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. అనంతరం పలు అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రేడ్-1 లైబ్రేరియన్ అర్జున్, గ్రేడ్-3 లైబ్రేరియన్ సరిత, జూనియర్ అసిస్టెంట్ మల్లయ్య, రికార్డ్ అసిస్టెంట్ గౌతమి తదితరలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

తిమ్మాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మోదీ గిఫ్ట్ పేరిట కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న సైకిళ్లను మండలంలోని పర్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణా రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎవరూ చేయలేనటువంటి కార్యక్రమాలను బండి సంజయ్ చేపడుతున్నారని, రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. సైకిళ్ల అందజేయడంతోపాటు విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లించడం గొప్ప విషయమన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి, నాయకులు తిరుపతి రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాజశేఖర్, జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన

కరీంనగర్ అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం జిల్లా కేంద్రంలో పర్యటించారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సోదరుడు గంగుల సుధాకర్ కుమారుడి వివాహం సందర్భంగా శనివారం వారి నివాసంలో వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే గంగల కమలాకర్ పాల్గొన్నారు.

కోతిరాంపూర్‌లోని మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి పడిశెట్టి భూమయ్య కుమారుడు సాయి చరణ్ రమ్య వివాహం ఇటీవల జరగగా వధూవరులను, అనంతరం తన క్లాస్‌మెట్, చిన్ననాటి మిత్రుడు విద్యామారి రాంగోపాల్ కుమారుడు శ్రీధర్ (ఐఏఎస్, మణిపూర్) వివాహం ఇటీవల జరగగా దంపతులను, అనంతరం ముస్కు శ్యామ్‌సుందర్‌రెడ్డి కుమారుడు అభిలాష్‌రెడ్డి వివాహం ఇటీవల జరగగా దంపతులను ఆశీర్వదించారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కోహెడ మాజీ ఎంపీపీ చక్రధర్ తండ్రి మరణించడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మంత్రి తన చిన్ననాటి స్నేహితులు కిరణ్, వేణు ఇళ్లకు వెళ్లారు. అనంతరం ఇటీవల మృతి చెందిన కోడూరి శైలేష్ నివాసానికి వెళ్లి నివాళులు అర్పించారు. మంత్రి వెంట టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, మాజీ కార్పొరేటర్లు మాచర్ల ప్రసాద్, రాజేందర్‌రావు, పడిశెట్టి భూమయ్య డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.



ఆశీర్వదిస్తున్న మంత్రి పొన్నం, పక్కన ఎమ్మెల్యే

కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం

తిమ్మాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని పర్లపల్లిలో శనివారం నిర్వహించిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 19న హుజురాబాద్‌లో కరీంనగర్ పార్లమెంట్ స్థాయి బూత్ స్థాయి కార్యకర్తల సమ్మేళనం నిర్వహించనున్నట్లు చెప్పారు. బీజేపీ రాష్ట్ర నాయ కత్వంతోపాటుగా కేంద్ర మంత్రి బండి సంజయ్ సమ్మిలితం కానున్నారన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరా చారి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండు కొమురయ్య, నాయకులు జగన్‌రెడ్డి, బూట్ల శ్రీనివాస్, శ్రీనివాస్, అరుణ్, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంకులో సహకార వారోత్సవాలు

కరీంనగర్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకులో 72వ సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం స్థానిక బ్యాంకు ప్రధానశాఖ కార్యాలయ ఆవరణలో బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్ సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఖాతాదారులు, సభ్యులు, ఉద్యోగులు, పాలకవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. పాలకవర్గ సభ్యులు దేశ వేదాద్రి, వరాల జ్యోతి, బొమ్మరాతి సాయికృష్ణ, బాశెట్టి కిషన్, తాడ వీరారెడ్డి, కన్నసాయి, శ్వేతక్రాంతి, ఆనందం, రతన్‌రాజు, బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరించిన బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్

త్వరలో రోడ్డు పనులు ప్రారంభం

గన్నేరువరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పదిహేను రోజుల్లో డబుల్ రోడ్డు పనులను ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. డబుల్ రోడ్డు నిర్మాణం నెల రోజుల్లో పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ యువజన సంఘాల నాయకులు ఆదివారం గుండ్లపల్లి హైవేపై మహాధర్నాకు పిలుపునిచ్చారు. దీనిపై స్పందిస్తూ శనివారం ఎమ్మెల్యే మీడియా ద్వారా ప్రకటన విడుదల చేశారు. మండల డబుల్ రోడ్డు సాధన కోసం ఆనాడు తాను సైతం ఉద్యమంలో పాల్గొన్నట్లు, కేసులను ఎదుర్కొన్నట్లు గుర్తు చేశారు. పనులు పూర్తి చేయించే బాధ్యత తనమీదనే ఉన్నదని పేర్కొన్నారు.

రోడ్లను ఆక్రమిస్తే చర్యలు



పరిశీలిస్తున్న కమిషనర్ అయాజ్

జమ్మికుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలో రోడ్లను ఆక్రమిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ అయాజ్ అన్నారు. శనివారం జమ్మికుంటలో రైల్వే ఓవర్ బ్రిడ్జికి ఇరువైపులా రోడ్లను పరిశీలించారు. బ్రిడ్జి కింద ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారులు, అవతలివైపు ఉన్న దుకాణదారుల వద్దకు వెళ్లి రోడ్లు ఆక్రమించకూడదని సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆయన వెంట ఏఈ వికాస్, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, సానిటరి ఇన్‌స్పెక్టర్ మహేష్, సదానందం, టీపీబీవో దీపిక పాల్గొన్నారు.

కోర్టు ఏర్పాటుకు భవనాల పరిశీలన

జమ్మికుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు కోసం ప్రభుత్వ భవనాలను హుజూరాబాద్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఓల్డ్ డిగ్రీ కళాశాల భవనం, బాలికల వసతిగృహం, మున్సిపాల్టీ భవనాన్ని పరిశీలించి కోర్టు ఏర్పాటుపై స్థానికుల అభిప్రాయం సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక మండలాల ప్రజలకు న్యాయ సేవలు అందించేందుకు జమ్మికుంటలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు కోసం ప్రభుత్వ భవనాలను పరిశీలించినట్లు చెప్పారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యతిపతి అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు నూతల శ్రీనివాస్, ప్రధాన సలహాదారుడు అందం వెంకటేశ్వర్‌రావు, జాయింట్ సెక్రటరీ పిట్టల రాజేష్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

● జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురవగా జడ్జి కిరణ్‌కుమార్ సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

ఎస్ఆర్ఎంలో ముగిసిన ఓరియంటేషన్



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల చైర్మన్ తిరుపతిరెడ్డి

భగత్‌నగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్ఆర్ఎంలో ఎంబీఏ, ఎంసీఏ ఓరియంటేషన్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కోర్సు ముగిసేలోపు నైపుణ్యాలు మెరుగు పరుచుకోవాలన్నారు. అనంతరం ఎంబీఏ చివరి, మొదటి సంవత్సరం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతోపాటు ఇటీవల గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులను సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఖ్వాజా మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పేదింటి బిడ్డకు గోల్డ్ మెడల్

కరీంనగర్ అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన ప్రైవేట్ టాక్సీ డ్రైవర్ శ్రీనివాస్ కూతురు మోతె నిఖిత బెంగళూరు సెంట్రల్ యూనివర్సిటీ సెకండ్ ర్యాంక్‌తో గోల్డ్ మెడల్ సాధించింది. ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్‌లో యూనివర్సిటీ సెకండ్ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా నిఖితను పలువురు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మతల్లి బోనాలు

హుజూరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం భక్తిశ్రద్ధలతో పెదమ్మతల్లి బోనాలు నిర్వహించారు. పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ, నూతన దేవాలయం ప్రారంభం సందర్భంగా నాలుగు రోజులుగా హోమాలు, పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పంటలు పండాలని అమ్మవారికి వేడుకున్నట్లు భక్తులు పేర్కొన్నారు.

ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సాముండా

భగత్‌నగర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): భారతీయ ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం నగరంలోని పార్లమెంట్ కార్యాలయంలో బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కట్ట రాజు కుమార్ ఆధ్వర్యంలో బిర్సా ముండా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ బిర్సా ముండా జయంతి సందర్భంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నవంబరు 15ను జన్ జాతీయ గౌరవ దివస్‌గా ప్రకటించిందన్నారు. నాయకులు మొగిలి శ్రీనివాస్, శ్రీకాంత్‌నాయక్, సాయి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కందుగుల ప్రభుత్వ పాఠశాలలో భగవాన్ దాస్ బిర్సా ముండా జయంతి నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి ఓరుగంటి తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి